సాక్షి జగిత్యాల

శనివారం । 15 । జూలై । 2023



కొమ్మ కత్తిరింపుపై అవగాహన

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అల్లీపూర్‌లో మామిడి కొమ్మ కత్తిరింపుపై అవగాహన కల్పించారు.



పోచమ్మకు మొక్కులు

జగిత్యాలజోన్: లక్ష్మీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకులం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జెడ్పీ చైర్‌పర్సన్‌తో భేటీ



వసంతతో నాయకులు

జగిత్యాలజోన్: జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంతను శుక్రవారం మున్నూరుకాపు సంఘం నాయకులు కలిశారు. జిల్లా కేంద్రంలో మున్నూరుకాపు విద్యార్థుల కోసం గ్రంథాలయం, హాస్టల్, కమ్యూనిటీ హాల్ భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా వసంతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు విద్యావంతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపెల్లి గ్రామంలో అట్రాసిటీ కేసు విషయంలో మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి శుక్రవారం విచారణ జరిపారు. గ్రామానికి చెందిన ముగ్గురు తనను కులం పేరుతో దూషించారని అదే గ్రామస్తుడు కోట నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ గ్రామంలో విచారణ చేపట్టారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పలువురిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న అధికారులు

మల్లాపూర్(కోరుట్ల): పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుట్ల ఏడీఏ రమేశ్ సూచించారు. శుక్రవారం రాఘవపేటలో మొక్కజొన్న, సోయాబీన్ పంటలను ఆయన పరిశీలించారు. ప్రస్తుత వాతవరణ పరిస్థితులు, చీడపీడలు, తెగుళ్లు ఆశించడానికి అనుకూలంగా ఉందన్నారు. మోతాదు మించకుండా ఎరువులు, పురుగు మందులు వాడితే పంటలకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈవోలు గజానంద్, సంధ్య, ఎంపీటీసీ ఆరే రాజేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పరిచయం



పుస్తకాలు అందిస్తున్న రచయిత రాజేశ్వర్

ధర్మపురి: పట్టణానికి చెందిన రిటైర్డ్ తెలుగు పండితుడు కశోజ్జుల రాజేశ్వర్ రాసిన ధర్మపురి క్షేత్ర మహత్మ్యం పుస్తక పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చెరుకు రాజన్న ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు పుస్తకం గురించి వివరించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లోని గ్రంథాలయాలకు ఉచితంగా అందజేశారు. అనంతరం పుస్తక రచయిత కశోజ్జుల రాజేశ్వర్‌ను శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రావులపెల్లి శ్రీనివాస్, గొల్లపల్లి ఉమాదేవి, గణేశ్ తదితరులున్నారు.

ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి శుక్రవారం సాయంత్రానికి 12,515 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గోదావరి నది ఎగువ ప్రాంతాల నుంచి 8,165 క్యూసెక్కులు, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో ప్రస్తుతం ఎస్సారెస్పీలో నీటి మట్టం 1,067.20 అడుగులకు చేరగా.. నీటి నిల్వసామర్థ్యం 23.939 టీఎంసీలుగా ఉంది.

రిజర్వు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు రిజర్వు ఇన్‌స్పెక్టర్ల(ఆర్‌ఐ)లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల ఆర్‌ఐగా పనిచేస్తున్న ఎస్.వామనమూర్తిని రామగుండం కమిషనరేట్‌కు, అలాగే ఆర్‌ఐ గంగదరి సైదులును ఆక్టోపస్ ఏడీజీపీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అక్రమాల ఐసీడీఎస్!

- పౌష్టికాహారం పక్కదారి
- బహిరంగ మార్కెట్‌కు పాల ప్యాకెట్లు
- అనుమతి లేకుండా విధులకు డుమ్మా
- ఉన్నతాధికారులకు వరుస ఫిర్యాదులు
- రంగంలోకి దిగిన వరంగల్ ఆర్జేడీ
- ఐదు మండలాల్లో విస్తృత తనిఖీలు



మెట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్జేడీ ఝాన్సీభాయి, అధికారులు

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని మెట్‌పల్లి సమగ్ర శిశు అభివృద్ధి కార్యక్రమం(ఐసీడీఎస్) ప్రాజెక్టును వివాదాలు చుట్టుముడుతున్నాయి. ప్రాజెక్టు పరిధిలో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కొంతకాలం నుంచి వరుసగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ బాధ్యతను వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) ఝాన్సీలక్ష్మీభాయికి అప్పగించారు. ఆమె శుక్రవారం జిల్లాకు చేరుకున్నారు. వచ్చీరాగానే ప్రాజెక్టు ఇన్‌చార్జి పీడీ నరేశ్, సీడీపీవో, సూపర్‌వైజర్లతో కలిసి పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏకకాలంలో దాడులు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇలా విస్తృతంగా తనిఖీలు చేయడం సిబ్బందిలో కలకలం సృష్టించింది. మరోవైపు.. ఇంతకాలం స్థానిక అధికారుల అండతో దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

జిల్లాలో 312 అంగన్‌వాడీ కేంద్రాలు

- ప్రాజెక్టు పరిధిలో మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల, కథలాపూర్ మండలాలు ఉన్నాయి.
- ఐదు మండలాల్లో మొత్తం 312 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి.
- చాలాచోట్ల నిబంధనల ప్రకారం పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. కొన్ని చోట్ల టీచర్లు పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య ఉన్నదాని కంటే ఎక్కువగా చూపడం.. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేయకున్నా చేసినట్లు రికార్డుల్లో నమోదు చేయడం, పాల ప్యాకెట్లు, ఇతర ఆహార పదార్థాలను ప్రైవేటుగా అమ్ముకోవడం, కొందరు టీచర్లు అనుమతి లేకుండా రోజుల తరబడి విధులకు డుమ్మా కొట్టడం, కేంద్రాలను సక్రమంగా తెరవకపోడం వంటివి చేసున్నారనే విమర్శలు ఉన్నాయి.
- వీటిపై సింగిల్‌విండో డైరెక్టర్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.
- మరోవైపు.. కాలం చెల్లిన ప్యాకెట్లలోని పాలు పంపిణీ చేస్తున్నారని ట్విట్టర్ ద్వారా స్థానికుడు ఒకరు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.
- వీటిని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు.. అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని వరంగల్ ఆర్జేడీని ఆదేశించారు.

ప్రతినెలా రూ.కోటికి పైగా వెచ్చింపు..

- గర్భిణులకు పౌష్టిహాకారం అందించేందుకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రోజూ రూ.21 చొప్పున వెచ్చిస్తోంది. జిల్లాలో వీరు ప్రస్తుతం 7,677 మంది ఉండగా రోజూ సుమారు రూ.1,61,217 వంతున నెలకు దాదాపు రూ.48,36,510 ఖర్చు చేస్తోంది.
- అదేవిధంగా బాలింతలకు ఒక్కొక్కరికి రూ.21 చొప్పున కేటాయిస్తోంది. వీరు జిల్లాలో 6,316మంది ఉన్నారు. వీరికి రోజూ రూ.1,32,636 ఖర్చవుతుండగా, నెలకు రూ.39,79,080 వరకు ప్రభుత్వం కేటాయిస్తోంది.
- చిన్నారుల పౌష్టికాహారం కోసం ప్రభుత్వం రోజూ రూ.9చొప్పున కేటాయిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో చిన్నారులు 35,977 మంది ఉన్నారు. వీరికి రోజూ రూ.3,23,793 వంతున నెలకు సుమారు రూ.97,13,790 ఖర్చు చేస్తోంది.
- జిల్లావ్యాప్తంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కలిపి ప్రతినెలా ప్రభుత్వం సుమారు రూ.కోటికి పైగా వెచ్చిస్తోందని తెలుస్తోంది. కేవలం పౌష్టికాహారంపైనే ప్రభుత్వం ఇంతపెద్దమొత్తంలో వెచ్చించి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం పాటుపడుతుంటే.. కొందరు అక్రమార్కులు ఈ సొమ్మును దుర్వినియోగం చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

సీడీపీవో తీరుపై టీచర్ల ఆగ్రహం..

- అక్రమాలపై చర్యలు తీసుకునే విషయంలో సీడీపీవో తిరుమలాదేవి వ్యవహరిస్తున్న తీరుపై పలువురు టీచర్లు ఆగ్రహంతో ఉన్నారు.
- కొన్నినెలల క్రితం పాల ప్యాకెట్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన వైనంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన సీడీపీవో.. అలా కాకుండా ప్రాజెక్టు పరిధిలోని టీచర్లకు మెమోలు జారీచేశారనే ప్రచారం ఉంది.
- ఇటీవల మంత్రి కేటీఆర్‌కు చేసిన ఫిర్యాదు విషయంలోనూ ఇలాగే మెమోలు జారీచేసినట్లు తెలిసింది.
- బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోకుండా సీడీపీవో అందరికీ మెమోలు ఇవ్వడంపై అగ్రహంతో ఉన్న మెజార్టీ టీచర్లు.. ఇప్పటికే ఆమె పై ఆర్జేడీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అక్రమార్కుల్లో గుబులు..

- ఉన్నతాధికారుల ఆదేశాలతో వరంగల్ ఆర్జేడీ మెట్‌పల్లి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు.
- గతనెల 28న ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- తాజాగా శుక్రవారం ముగ్గురు సీడీపీవోలు, పదిమంది సూపర్‌వైజర్లతో కలిసి పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏకకాలంలో దాడులు జరిపారు.
- ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో మూడేళ్లకు సంబంధించిన రికార్డులు, సమాచారం సేకరించారు.
- క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వద్దకు వెళ్లి పౌష్టికాహారం పంపిణీ గురించి ఆరా తీశారు.
- మొత్తానికి విచారణలో ఏం తేలుతుంది? ఎవరిపై చర్యలు తీసుకుంటారనే దానిపై సిబ్బంది మధ్య జోరుగా చర్చ సాగుతోంది.

పనితీరు తెలుసుకోవడానికే..

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ, సిబ్బంది పనితీరు గురించి తెలుసుకోవడానికే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నాం. రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ఆ తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం.
– ఝాన్సీలక్ష్మీభాయి, ఆర్జేడీ, వరంగల్

పర్యాటక కేంద్రంగా కొండగట్టు

కొండగట్టు(చొప్పదండి): మరో కీసరలా కొండగట్టు గుట్టలు పచ్చదనంతో మారనున్నాయని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా రాజ్యసభ సభ్యుడు జోగినపెల్లి సంతోష్‌కుమార్ కొండగట్టులో వెయ్యి ఎకరాలను దత్తత తీసుకొని మొక్కల పెంపకం ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఈమేరకు చేపట్టిన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. కొండగట్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారడం లక్ష్యంగా ఈ ప్రక్రియ చేపట్టారని వివరించారు. ఇందులో భాగంగా మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ శనివారం కొండగట్టులో పర్యటిస్తారని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కొండగట్టు అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.100 కోట్ల విలువైన పనుల్లో భాగంగా గుట్టపైకి లిఫ్ట్ ద్వారా నీరందించే పనులను ఈనెల 25లోపు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

టూరిజం అభివృద్ధికి కృషి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వసంత తదితరులు

జగిత్యాలజోన్: రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. స్థానిక జెడ్పీ క్యాంపు కార్యాలయానికి శుక్రవారం ఆయన రాగా జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పూలమొక్క, శాలువాతో వసంత సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, దేశంలోని అన్నిరాష్ట్రాల టూరిస్టులు రాష్ట్రానికి వచ్చేలా టూరిజం స్పాట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్క హైదరాబాద్ మాత్రమే కాకుండా రాష్ట్రంలోని ప్రధాన నగరాలను కూడా పర్యాటక ప్రాంతాలకుగా మార్చుతామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత వివరించారు.

పారిశుధ్యం నిర్వహణపై దృష్టి



లక్ష్మీపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న దేవరాజ్

జగిత్యాలరూరల్: గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ సూచించారు. లక్ష్మీపూర్ గ్రామంలో డ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచడంతోపాటు, సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులను దృష్టిలో ఉంచుకుని పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, నీటి నిల్వలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో కనకదుర్గ, ఎంపీవో రవిబాబు, సర్పంచ్ చెరుకు జాన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి పాత కంప్యూటర్లు

జగిత్యాల: జిల్లాలోని 140 ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు, కేజీబీవీల్లోని పాత కంప్యూటర్లు, విడిభాగాలు విక్రయించేందుకు నిర్ణయించామని డీఈవో జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆసక్తి గలవారు, సంస్థల నుంచి ఈ నెల 19న సాయంత్రం 5 గంటల్లోపు సీల్డ్ కొటేషన్ల విద్యాశాఖ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

ఎన్నికల బదిలీలు షురూ!

- పెద్దపల్లి కలెక్టర్‌గా ముజమ్మిల్ ఖాన్
- కరీంనగర్ జెడ్పీ సీఈవోకు పెద్దపల్లి అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు
- సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా గరిమా బదిలీ



దివాకర(ఇన్)



మకరంద్(అవుట్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సార్వత్రిక ఎన్నికల క్రమంలో బదిలీల వేగం పుంజుకుంది. ఇటీవల డీఎస్పీలను బదిలీ చేసిన ప్రభుత్వం శుక్రవారం అదనపు కలెక్టర్లను బదిలీ చేయగా కన్ఫర్డ్ ఐఏఎస్‌లకు పదోన్నతి కల్పిస్తూ అదనపు కలెక్టర్లుగా నియమించింది. అలాగే ఆర్డీవోలకు సైతం స్థానచలనం కల్పించింది. ఉమ్మడి జిల్లాలో పలువురు అదనపు కలెక్టర్లను బదిలీ చేయగా నేడు, రేపు కూడా మరిన్ని బదిలీలు జరిగే అవకాశముందని సమాచారం.

- సిద్దిపేట అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) ముజమ్మిల్‌ఖాన్‌ను పెద్దపల్లి కలెక్టర్‌గా నియమించగా పెద్దపల్లి కలెక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణను టీఎస్ ఫుడ్స్ ఎండీగా నియమించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) దివాకర్‌ను జగిత్యాల అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమించగా అదనపు కలెక్టర్ మంద మకరంద్‌ను నిజామాబాద్ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.
- పెద్దపల్లి అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) కుమార్ దీపక్‌ను నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేయగా అతనిస్థానంలో కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సతీమణి కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంకను నియమించారు.
- వెయిటింగ్‌లో ఉన్న జల్ద అరుణశ్రీని కరీంనగర్ అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమించారు. ఈమె గతంలో కరీంనగర్ డీఆర్డీవోగా విధులు నిర్వహించారు.
- కరీంనగర్ జాయింట్ కలెక్టర్(ట్రైనీ) నవీన్ నికోలస్‌ను తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ సెక్రటరీగా నియమించారు.
- కరీంనగర్ అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) గరిమా అగర్వాల్‌ను సిద్దిపేట అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమించారు.
- కరీంనగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా ఉన్న శ్యాం ప్రసాద్‌లాల్‌ను పెద్దపల్లి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీఅయ్యారు. శ్యాంప్రసాద్‌లాల్ స్థానంలో సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న కె.లక్ష్మీకిరణ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆర్డీవోలు సైతం

ప్రస్తుతం ఉట్నూరు ఆర్డీవోగా ఉన్న కె.మహేశ్వర్‌ను కరీంనగర్ ఆర్డీవోగా నియమించారు. కరీంనగర్ ఆర్డీవోగా ఉన్న ఎన్.ఆనంద్‌కుమార్‌ను సిరిసిల్లకు బదిలీచేశారు. సిరిసిల్ల ఆర్డీవోగాఉన్న టి. శ్రీనివాసరావు డిప్యూటీ కలెక్టర్ అండ్ తహసీల్దార్ శేరిలింగంపల్లికి బదిలీపై వెళ్లనున్నారు. ప్రస్తుతం జగిత్యాల ఆర్డీవోగా ఉన్న మాధురిని సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా పంపారు.

సివిల్స్–2016లో తెలంగాణ టాపర్

ముజమ్మిల్‌ఖాన్ 2014లో తొలిసారిగా సివిల్స్ రాస్తే ఐఆర్‌టీఎస్ వచ్చింది. శిక్షణ పూర్తయ్యాక ఏసీఎంగా కొలువు దక్కింది. 2015లో మళ్లీ సివిల్స్ రాయగా ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. అందులో చేరకుండా పాత ఉద్యోగంలోనే కొనసాగుతూ మూడోసారి 2016లో సివిల్స్ రాయగా జాతీయస్థాయిలో 22వ, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సాధించారు. ఐఏఎస్ శిక్షణ పూర్తి చేశాక 2018లో వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్, హుస్నాబాద్ డిప్యూటీ కలెక్టర్ పని చేశారు. ఫిబ్రవరి 2020లో సిద్దిపేట జిల్లాకు అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. శుక్రవారం పెద్దపల్లి కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈయన మాజీ సీనియర్ ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్ కుమారుడు కావడం గమనార్హం.

జనవరిలోనే చెప్పిన సాక్షి

సీపీ సత్యనారాయణ, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ బదిలీ అవుతారని, అలాగే గతంలో జెడ్పీ సీఈవోగా ఉన్న ప్రియాంకకు ఐఏఎస్ హోదా రానుందని, ఆ వెంటనే బదిలీ కూడా అవుతారని ‘సాక్షి’ ఈ ఏడాది జనవరి 3న కథనం ప్రచురించింది. ఆ కథనం ప్రకారమే ఈ ముగ్గురు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు.

జగిత్యాల అడిషనల్ కలెక్టర్‌గా దివాకర

జగిత్యాల: అడిషనల్ కలెక్టర్‌గా(స్థానిక సంస్థలు) దివాకర నియమితులయ్యారు. ప్రస్తుతం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న మంద మకరంద్ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. 9 నవంబర్ 2022లో బదిలీపై వచ్చిన మకరంద్.. 9 నెలలుగా జిల్లాలో సేవలు అందించారు. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న దివాకరకు జగిత్యాలలో పోస్టింగ్ ఇస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.

ఆర్డీవోగా నర్సింహమూర్తి

జగిత్యాల ఆర్డీవోగా నర్సింహమూర్తి నియమితులయ్యారు. ప్రస్తుతం నారాయణఖేడ్‌లో ఆర్డీవోగా పనిచేస్తున్న నర్సింహమూర్తి.. జగిత్యాలకు బదిలీ అయ్యారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీవో మాధురి సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా నియమితులయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన



మాట్లాడుతున్న సాయిబాబా

జగిత్యాల: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సాయిబాబా సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో మైనార్టీ రెసిడెన్షియల్ ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల్లో పనిచేస్తున్న విద్యార్థులకు మంచి విద్యనందించాలన్నారు. చదువులపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రుచికరమైన భోజనం అందించాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చూడాలని ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు పోలీసులకు సేవా పతకాలు

జగిత్యాలక్రైమ్: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలు ప్రకటించింది. జగిత్యాల ట్రాఫిక్ ఎస్సైగా పనిచేసి, ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న లోకిని రాము, అలాగే ఐటీ సెల్‌లో పనిచేస్తున్న రఘుపతిని ఉత్తమ సేవాపతకాలకు ఎంపిక చేసింది. ఎస్సై రాము, కానిస్టేబుల్ రఘుపతిని ఎస్పీ భాస్కర్ అభినందించారు.

అర్హులందరికీ ఓటుహక్కు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: అర్హులైన ప్రతీఒక్కరికి ఓటుహక్కు కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. శుక్రవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లతో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించేందుకు కచ్చితంగా ఓటర్ల ధ్రువీకరణ ఉండాలన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, నియోజకవర్గాల వారీగా ప్రతీ గ్రామం, ఆవాసాల్లో పర్యటించి ఈవీఎంలు, ఇతర యంత్రాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సెప్టెంబర్ నాటికి ప్రక్రియ పూర్తిచేస్తామని పేర్కొ ఈవీఎం, వీవీపాట్లపై ప్రజలకు అవగాహన కల్పించే ట్రైనర్లకు ఈనెల 18న జిల్లాలో శిక్షణ ఇస్తామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 7,948 ఫారం 6, 1,147 ఫారం 7, 10,197 ఫారం 8 దరఖాస్తులు అందాయని వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మాధురి, అదనపు కలెక్టర్లు మకరంద్, లత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన జిల్లా రవాణా శాఖ అధికారి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి

జగిత్యాలక్రైం: జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జి.వంశీధర్ శుక్రవారం ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌ను పోలీసు ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై చర్చించారు.

డీఈవోకు ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న జగతి ప్లేస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డీఈవోకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగతి ప్లేస్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేవని, అయినా పాఠశాల నిర్వహిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్, కన్వీనర్ బచ్చల వినోద్, నాయకులు సులేమన్, అరుణ్, రమేశ్ పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన 11 మంది వివిధ కేసుల్లో ఉండగా శుక్రవారం జగిత్యాల తహసీల్దార్ రవీందర్ ఎదుట బైండోవర్ చేసినట్లు పట్టణ ఎస్సై రవీందర్ తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన దొంగతో పాటు, ఇద్దరు పాత నేరస్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం... తుంగూర్ గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివవరాల్లోకి వెళ్తే.. మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన నగేశ్ జగిత్యాల నుంచి తుంగూర్ వైపు వస్తుండగా, అదే సమయంలో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన చిరంజీవి జగిత్యాల వెళ్తుండగా ఇద్దరి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించారు.

మరో ఘటనలో...

మల్యాల(చొప్పదండి): మండలంలోని ముత్యంపేట గ్రామంలో మూలమలుపు వద్ద శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. తాటిపల్లి గ్రామానికి చెందిన కుమారస్వామి తీవ్ర గాయాలుకాగా స్థానికులు 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

శరవేగంగా లబ్ధిదారుల ఎంపిక

- రూ. లక్షసాయం అందించేందుకు బీసీ లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు
- తొలి విడతలో యాభై నుంచి వందమందికి
- జిల్లాలో 17,277 దరఖాస్తులు



కథలాపూర్‌లో మీసేవ కేంద్రం వద్ద దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన ప్రజలు

జగిత్యాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కుల, చేతి వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. జిల్లాలో ఎంతమంది దరఖాస్తులు చేసుకున్నారు.? అర్హులెవరు ? అనేది పరిశీలిస్తున్నారు. తొలి విడతలో నియోజకవర్గానికి యాభై నుంచి వందమందిని ఎంపిక చేసి రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు లబ్ధిదారులను ఏ ప్రతిపాదికన ఎంపిక చేస్తారో నిర్ధారణ కాలేదని అధికారులు తెలుపుతున్నారు. దాదాపు నియోజకవర్గానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు మంజూరైనట్లు సమాచారం. అర్హులైన లబ్ధిదారులందరికీ దాదాపు నిధులు మంజూరవుతాయని బీసీ అధికారులు చెబుతున్నారు. ప్రతినెలా 15వ తేదీన కటాఫ్ తేదీగా తీసుకొని ఆర్థికసాయం అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలవారీగా వచ్చిన దరఖాస్తులను మున్సిపాలిటీల్లో కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీవోలు పరిశీలిస్తున్నారు. మండలాలు, మున్సిపాలిటీల్లో అధికారుల ఆమోదం పొందిన తర్వాత దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్‌కు వస్తాయి. బీసీ సంక్షేమ అధికారుల ఆధ్వర్యంలో వాటిని పరిశీలిస్తారు. ఆ తర్వాత జిల్లా మంత్రి ఆమోదం తీసుకొని ఎమ్మెల్యే ద్వారా పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తొలి విడతలోనే దాదాపు 300 మంది వరకు అందనున్నట్లు చెబుతున్నా లబ్ధిదారుల్లో కొంత ఆందోళన మొదలైంది. గోప్యంగానే లబ్ధిదారుల ఎంపికచేస్తున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటితో కాకుండా, ప్రతినెలా 15వ తేదీ కటాఫ్ తేదీగా ఉంచి లబ్ధిదారులను ఎంపికచేసి ఆర్థికసాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 17,277 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలిస్తున్నారు. దాదాపు ఎంబీసీ కులాల్లో 36 వరకు ఉండగా, 14 కుల వృత్తులకు సైతం ఈ ఆర్థికసాయం అందనుంది. ఒకేసారి అందరు దరఖాస్తు చేసుకోవడంతో సైట్లు ఓపెన్ కాకపోవడం, మీసేవా సెంటర్ నిర్వాహకులు సైతం ఇబ్బందులకు గురయ్యారు. అనంతరం పూర్తిస్థాయిలో దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. తొలి విడతలో అందరికీ వచ్చేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అధికారులు మాత్రం తొలి విడతలోనే 200 నుంచి 300 యూనిట్లు వస్తాయని చెబుతున్నారు.

దళారుల బెడద

కులవృత్తులు, ఎంబీసీ కులాల వారికి రూ.లక్ష అందించేందుకు ప్రభుత్వం ప్రకటించినా నుంచి దళారుల బెడద ఎక్కువైంది. మేము ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి నుంచి ఎంతోకొంత డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దాదాపు ఒక్కొక్కరి నుంచి రూ.10 నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఇందులో మంత్రి, ఎమ్మెల్యేల ద్వారానే పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలపడంతో కొందరు అనుచరులు మేము ఇప్పిస్తామంటూ అమాయక ప్రజలకు గాలం వేస్తున్నారు. అయితే ఇందులో ఎలాంటి అవకతవకలు లేవని, ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేసుకోవాలని, పారదర్శకంగానే ఎంపిక జరుగుతుందని, ఎవరిని నమ్మొద్దని అధికారులు చెబుతున్నా కొందరు దళారులను సైతం ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది.

పారదర్శకంగా ఎంపిక



రూ.లక్ష ఆర్థికసాయం కోసం జిల్లాలో 17,277 దరఖాస్తులు వచ్చాయి. తొలి విడతలోనే పంపిణీ చేస్తారు. ఇంకా దరఖాస్తులు పరిశీలించి అర్హులందరికీ ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. పారదర్శకంగా ఎంపిక చేపడతాం.

– సాయిబాబా, బీసీ సంక్షేమాధికారి

త్రుటిలో తప్పిన ప్రమాదం

ధర్మపురి : ఒకటో అంతస్తు భవనంపై నుంచి పారాఫీట్ గోడ కూలగా త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని నంది కూడలి వద్ద ఉన్న ముస్లింల పీర్ల మసీద్ వెనుక భాగంలో మూడేళ్ల క్రితం పట్టణానికి చెందిన ఇక్బాల్ రెండంతస్థుల భవనం నిర్మించుకున్నాడు. రెండో అంతస్తుపై ఉన్న పారాఫీట్ గోడ ప్రమాదవశాత్తు కూలడంతో జనం ఒక్కసారిగా పరుగులు తీశారు. అక్కడున్న ద్విచక్రవాహనం ధ్వంసమైంది. దీంతో పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలానికి మున్సిపల్ కమిషనర్ రమేశ్, ఎస్సై దత్తాత్రి చేరుకొని రాకపోకలను నిలిపివేశారు. నాణ్యతా లోపంతో నిర్మించడంతో గోడ కూలిపోయినట్లు కాలనీవాసులు ఆరోపించారు.

నిర్మాణ పనులను తొలగించడంలో ఉద్రిక్తత..

రోడ్డును ఆనుకొని అక్రమంగా నిర్మించాడని పోలీసుల చొరవతో మున్సిపల్ అధికారులు జేసీబీతో కూల్చడానికి యత్నించగా భవన యజమానికి, అధికారుల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకొంది. అనంతరం అధికారులు వెనుదిరిగారు. దీనిపై కమిషనర్ రమేశ్‌ను వివరణ కోరగా కూలిన భాగాన్ని జేసీబీతో తొలగించామని, ఇక ముందు అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు.



కూలిన పారాఫీట్ గోడ

కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

కోరుట్ల: తమ డిమాండ్ల సాధన కోసం పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న సమ్మె నాలుగో రోజు చేరింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు పెంచిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలన్నారు. కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని, సరుకులు, కోడిగుడ్లు, సిలిండర్ సరఫరా చేయాలని కోరారు. ప్రభుత్వం కార్మికులతో చర్చించి సమ్మె విరమింపజేయకపోతే ఈనెల 17న ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు భాగ్య, పోసక్క, పద్మ, గంగు, విజయ, దేవక్క, పరమేశ్వరి, హారిక, హైమద్వి, అవిదా బేగం, తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

18 నుంచి దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకంలో భాగంగా 35 శాతం రుణ రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో రుణ మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా ఆహార శుద్ధి పరిశ్రమల డీఆర్పీ గుల్ల వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, జిల్లాలోని రైతులు, నిరుద్యోగ యువత స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రైవేట్ ఆహార పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జిల్లా పరిశ్రమల కేంద్రం సమీకృత కార్యాలయంలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ ఉపేందర్ రావు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల మంజూరుకు..

జగిత్యాల: కేసీఆర్ కా తోఫా పథకం కింద మైనార్టీ క్రిస్టియన్ నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల మంజూరు కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐదో తరగతి చదివి టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, తెల్లరేషన్ కలిగి ఉన్న నిరుపేద మైనార్టీ క్రిస్టియన్ మహిళలకు కవాతిన్ కేలియే భరోసా పథకం కేసీఆర్ కానుక ఫర్ క్రిస్టియన్ ఉమెన్ పథకం కింద ఉచితంగా కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన మహిళలు ఈనెల 20లోపు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల పేర్లు మార్పు

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని రెండు గ్రామాల పేర్ల మార్పునకు ప్రతిపాదనలు వెలువడ్డాయి. తిర్మలాపూర్(ఎం) పేరును మల్లన్నపేటగా, అలాగే ఇబ్రహీంనగర్ పేరును శ్రీరాములపల్లిగా మార్పు చేస్తూ నోటిఫికేషన్ జారీఅయింది. అభ్యంతరాలు, వినతులకు 15 రోజులు గడువు ఇచ్చారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా తిర్మలాపూర్ నుంచి మల్లన్నపేటగా అధికారికంగా గ్రామపేరును మార్పునకు సహకరించిన మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు ఆవారి చందు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇబ్రహీంనగర్ నుంచి శ్రీరాములపల్లి పేరు మార్పునకు సహకరించినందుకు మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా, పలువురికి గాయాలయ్యాయి. జగిత్యాల మండలం గోపాల్‌రావుపేటకు చెందిన కొంతమంది, కరీంనగర్‌కు చెందిన మరికొందరు వేర్వేరుగా శుక్రవారం స్వామివారి దర్శనం, వాహన పూజలకు వచ్చారు. ఇరు వర్గాలవారు పక్కపక్కనే కూర్చొని, దిగువ కొండగట్టులో భోజనం చేస్తుండగా మాటమాటా పెరిగి, ఇరువర్గాలు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లగా అప్పటికే వారిని ఆస్పత్రికి తరలించారని పోలీసులు తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ముత్యంపేట శివారులోని వరదకాలువ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (60) మృతిచెందినట్లు గుర్తించామని, మృతుడి ఒంటిపై నీలం రంగు టీషర్ట్, నల్ల రంగు ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 87126 56830, 8712656818 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై పేర్కొన్నారు.

గూడు రాలేదని గుండె ఆగింది



ఆస్పత్రిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఈర్ల రాజు(ఫైల్)

సిరిసిల్లటౌన్: సొంతింటి కోసం తొమ్మిదేళ్లుగా ఎదురుచూసిన నిరుపేద గుండె ఆగిపోయింది. డబుల్ బెడ్‌రూమ్ ఇంట్లో దర్జాగా బతకవచ్చనుకున్న దర్జీ శ్వాస ఆగింది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గోపాల్‌నగర్‌కు చెందిన ఈర్ల రాజు(48) దర్జీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ప్రభుత్వం అందించే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. డబుల్ బెడ్‌రూమ్ జాబితాలో పేరు వచ్చిన లక్కీ డ్రాలో ఇల్లు రాకపోవడంతో తీవ్ర మనోవేదకు గురయ్యాడు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, కలెక్టర్ కార్యాలయంలో ఇల్లు కోసం విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. సొంతింటి కల నెరవేరదనే బెంగతో మనోవేదనకు గురై శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రాజుకు భార్య శారద, డిగ్రీ చదువుతున్న కుమారుడు శివవర్ధన్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలా సహకారమందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్‌లో రూ.25లక్షలతో నిర్మించిన అతిథి గృహాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎమ్మెల్యే పెద్ద మొత్తంలో నిధులు మంజూరుచేయించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. మౌలిక వసతుల కోసం జిల్లా పరిషత్ నుంచి అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఎంపీడీఓ భీమేశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని వినతి..

జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘ భవనంతో పాటు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సంఘ నాయకులు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావులను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి వారు స్థలం కేటాయించడంతో పాటు వాటి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రిలో చేర్పించాలి

- మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి
- రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

కథలాపూర్(వేములవాడ): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రిలో చేర్పించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మేడిపెల్లి మండలకేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రథమ చికిత్సపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారిని వీలైనంత త్వరగా ఆస్పత్రిలో చేర్పిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. మద్యం తాగి వాహనాలను నడపొద్దన్నారు. గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చేయడంపై వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై చిరంజీవి, వైద్యాధికారి అనిల్, పూర్ణచంద్ర, సర్పంచ్ క్యాతం వరలక్ష్మి, ఎంపీటీసీ అంకం వినోద, నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాపాక సాయికుమార్



మానవహారం నిర్వహిస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

జగిత్యాలటౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రాపాక సాయికుమార్ పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏబీవీపీ విద్యార్థులు జగిత్యాల పాతబస్టాండ్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన విద్యార్థులు, నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనం కలుగలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5,300 కోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ విస్తారక్ నవీన్, నగర కార్యదర్శి మనువాడ నందు, జోనల్ ఇన్‌చార్జి రాజు, ప్రేం, మధుసూదన్, రక్షిత, మహాలక్ష్మి, వైష్ణవి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధిహామీ’ సామాజిక తనిఖీ



ఈజీఎస్ సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు

బుగ్గారం: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో లోపాలను గుర్తించిన ఆడిట్ అధికారులు పలువురు అధికారులకు, ఈజీఎస్ సిబ్బందికి జరిమానా విధించారు. మండలంలో చేపట్టిన పనుల్లో జరిగిన అవకతవకలకు రూ.55, 467లను జరిమానాగా విధించారు. శుక్రవారం బుగ్గారంలో జరిగిన సోషల్ ఆడిట్‌లో మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, వాటి వివరాలను స్టేట్ రిసోర్స్ పర్సన్ రాఘవులు ఆధ్వర్యంలో పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నివేదికలను తయారు చేశారు. యశ్వంతరావుపేటలో చేపట్టిన పనుల్లో అవకతవకలకు జరిగినట్లు, ఇందుకు రూ.23,074 జరిమానాగా విధించగా వెల్గొండలో రూ.9,220లను జరిమానాగా విధించారు. వెల్గొండ, గంగాపూర్, చందయ్యపల్లె, బుగ్గారం గ్రామాల కార్యదర్శులకు 6,334, వివిధ గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.4,927, ఈసీకి రూ.6,927కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.2,000 ఎంపీడీవో తిరుపతికి వెయ్యి జరిమానాగా విధించారు. ఓ గ్రామానికి చెందిన సర్పంచ్ అధికారులతో వాగ్వాదానికి దిగడం గమనార్హం. జెడ్పీటీసీ రాజేందర్, ఎంపీపీ రాజమణి, ఎంపీడీవో తిరుపతి, ఎస్ఆర్పీ రాఘవులు, డీఆర్పీ ప్రమోద్, ఏపీడీ బాలె శివాజీ, డీవీవో చిన్నయ్య, ఏపీవోలు ప్రవీణ్‌కుమార్, అనిల్ తదితరులున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



వినతిత్రం అందజేస్తున్న టీజేఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం : విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండలకేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావుకు తెలంగాణ విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు జిల్లాపెల్లి దిలీప్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు అందించి ప్రతి విద్యార్థికి యూనిఫామ్‌ను అందించాలన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకరావాలన్నారు. ఇక్కడ రాష్ట్ర కార్యదర్శి తరుణ్, మండల అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



కార్మికులతో కలిసి ధర్నాలో పాల్గొన్న గంగారెడ్డి

బుగ్గారం(ధర్మపురి): తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు టీజేఎస్ మద్దతునిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది శుక్రవారం చేపట్టిన ధర్నాలోనాయన పాల్గొని మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో తమ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు ఎలాంటి బెదిరింపులకు, ప్రలోభాలకు లొంగకుండా న్యాయ పోరాటాన్ని కొనసాగించాలని ఆయన కోరారు.

రెండేళ్లకే నూరేళ్లు

- నీటి సంపులో పడి బాలుడి మృతి



ఆదిత్య (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రెండేళ్లకే ఆ బాలుడికి నూరేళ్లు నిండాయి.. నీటి సంపులో పడి మృతిచెందగా.. ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యులు రోదించిన తీరు అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. పోలీసుల వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి శాస్త్రీనగర్‌కు చెందిన రాపోల్ సౌమ్య– వెంకటకృష్ణ దంపతులకు ఇద్దరు కుమారులు శ్రీవాత్సవ్, ఆదిత్య(2) ఉన్నారు. వెంకటకృష్ణ స్థానికంగా ఓ షోరూంలో పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఆదిత్య ఆడుకుంటున్నాడని భావించి, తల్లి సౌమ్య వంట పనిలో నిమగ్నమైంది. పని పూర్తి చేసుకొని, బయటకు వచ్చి చూడగా ఆదిత్య కనిపించలేదు. చుట్టుపక్కల వెతుకుతుండగా నీటిసంపులో మునిగి కనిపించాడు. బయటకు తీసి, వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజేందర్ పేర్కొన్నారు.